సాక్షి తిరుపతి

ఆదివారం । 15 । జూన్ । 2025

I



సమస్యలపై గళం విప్పుదాం

సచివాలయాల్లో పనిచేస్తున్న సర్వేయర్ల న్యాయమైన సమస్యలపై గళం విప్పుదామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్నారు - IIలో



చివరి దశకు అయ్యోర్ల బదిలీలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల కసరత్తు ముగింపు దశకు చేరుకుంది. - IIలో



బదిలీల్లో చిత్ర విచిత్రాలు

నిబంధనల విరుద్ధంగా బదిలీ ఉత్తర్వులు రావడంతో భాషా పండితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - IIలో

న్యూస్‌రీల్

శ్రీ సిటీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



ట్రైనీ ఐఏఎస్‌లను సన్మానించిన శ్రీసిటీ ప్రతినిధులు

సత్యవేడు: ఏపీ దర్శన్ సీడీ టూర్‌లో భాగంగా 2-24బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ట్రైనీ ఐఏఎస్‌లు శనివారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీ సిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) శివశంకర్ వీరికి స్వాగతం పలికారు. శ్రీ సిటీ ప్రణాళిక, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, సుస్థిర అభివృద్ధిపై వారికి ప్రదర్శన ఇచ్చారు. మేక్-ఇన్-ఇండియా మిషన్‌లో శ్రీసిటీ పాత్ర, భారీ ఉపాధి కల్పన, ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు ఎలా ఊతమిచ్చారనే అంశాలను వివరించారు. పర్యటనలో భాగంగా ట్రైనీ ఐఏఎస్‌లు శ్రీసిటీ పరిసరాలు సందర్శించారు. మెండెలెస్ (క్యాడ్‌బరీస్) డైకిన్, ఎయిర్ కండిషనింగ్ పరిశ్రమలను సందర్శించారు. ఇక్కడి ఉత్పత్తులు, పనితీరును తెలుసుకున్నారు. శ్రీ సిటీ ప్రణాళిక, అమలు, వ్యాపార అనుకూల వాతావరణాన్ని ప్రశ్నించిన ట్రైనీ ఐఏఎస్‌లు, ఇతరులు అనుసరించాల్సిన అద్భుత మోడల్‌గా దీనిని అభివర్ణించారు. ట్రైనీ ఐఏఎస్‌లే కాకుండా దేశ విదేశాలకు చెందిన అధికారులు, వ్యూహకర్తలు తమ అధ్యయనానికి శ్రీసిటీని ఎంచుకోవడం గర్వకారణమని శ్రీ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

సత్యవేడు : మదనంబేడు అటవీ సమీప ప్రాంతంలో ట్రంచ్‌లు తవ్వుతున్న ఉపాధి కూలీలు ఐదుగురిపై తేనెటీగలు దాడి చేశాయి. శనివారం మదనంబేడుకు చెందిన ఉపాధి కూలీలు 180 మంది ట్రెంచ్‌ల పనులకు వెళ్లారు. భూతేశ్వరమ్మ ఆలయ సమీపంలో ట్రెంచ్ తీస్తున్న గోపి(53) సుజాత(50) మరో ముగ్గురిపై తేనెటీగలు దాడి చేశాయి. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్ సత్యవేడు వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించి గోపి, సుజాతను తరువళ్లూరు(తమిళనాడు) జీహెచ్‌సీకి తరలించారు. సమాచారం తెలుసుకొన్న ఏపీఓ విజయ భాస్కర్ సంఘటనా స్థలానికి చేరుకొని ఉపాధి కూలీలను అప్రమత్తం చేశారు.



టీడీపీ నేత దాష్టీకానికి నేలమట్టమైన నాగాలమ్మ ఆలయం (ఇన్‌సెట్) ఆలయం కూల్చకముందు పూజలు చేస్తున్న మహిళ

కులదైవాన్ని కూల్చేశారు!

కూటమి ప్రభుత్వంలో ఆలయాలపై విధ్వంసం జరుగుతున్నా నోరు మెదపడంలేదు. రెండు రోజుల కిందట తిరుచానూరు సమీపంలో వారాహి అమ్మవారి ఆలయం ధ్వంసం చేసి, విగ్రహాన్ని ముక్కలు చేసి మురుగు కాలువలో పడేశారు. నేడు దామినేడు వద్ద వందల ఏళ్ల నాటి నాగాలమ్మ ఆలయాన్ని నేలమట్టం చేసి ఆ గ్రామ ప్రజలకు ఇలవేల్పును లేకుండా చేశారు. ఇసుక తవ్వకాలకు అడ్డుగా ఉందని ఒక చోట..విలువైన భూములకు అడ్డుగా ఉందని ఇక్కడ ఆలయాలను కూల్చడంపై ప్రజలు మండిపడుతున్నారు.

నాగాలమ్మ ఆలయం నేలమట్టం

- కూటమి ప్రభుత్వంలో ఆలయాలకు రక్షణ కరువు
- ప్రశ్నిస్తామన్న పవన్‌కళ్యాణ్ ఇప్పుడు ఎక్కడ ?
- బాబు కులదైవమైన నాగాలమ్మ ఆలయం కూల్చినా పట్టని ప్రభుత్వం
- నకిలీ పత్రాలతో రూ.40 కోట్ల విలువైన ఇనాం భూములు టీడీపీ నేత ఆక్రమణ
- దామినేడులో సగం గ్రామాన్ని కృష్ణమూర్తి నాయుడు పేరుపై అధికారుల ధారదత్తం
- ఆలయం కూల్చివేతపై మండి పడుతున్న హిందూ సంఘాలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతలు వరుసగా హిందూ ఆలయాలను కూల్చివేయడం హిందూ సమాజంపైన దాడేనని ప్రజలు, హిందూ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తిరుచానూరు సమీపంలోని దామినేడు వద్ద వందల్ల ఏళ్ల నాటి నాగాలమ్మ ఆలయాన్ని టీడీపీ నేత కృష్ణమూర్తి నాయుడు, అతని కుమారుడు దివాకర్ నేలమట్టం చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత దారుణానికి ఒడిగడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్, స్థానిక టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని తీరుపై మండి పడుతున్నారు. హిందూ సమాజంపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టేందుకు హిందూ సంఘాలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.

భూములు కాజేసేందుకు కుట్ర

కూటమి నేతలు పథకం ప్రకారం భూములను కాజేసేందుకు ఆలయాలను నేలమట్టం చేస్తున్నారని ఆరోపణలు గుప్పమంటున్నాయి. కోట్ల రూపాయల విలువైన ఇనాం భూములను 2014–19 మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో కృష్ణమూర్తి నాయుడు తప్పుడు పత్రాలతో రికార్డులను సృష్టించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో గతంలో గ్రామంలోని ప్రజలు అడ్డుకుని నిరసనకు దిగడంతో అప్పట్లో మిన్నుకుండిపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం, సుమారు రూ.40 కోట్ల విలువైన భూములు జాతీయ రహదారికి అనుకుని ఉండటంతో అరాచకానికి పాల్పడుతున్నారు. ఇంత దారుణమైన ఘటనలు ఏ ప్రభుత్వంలోనూ చూడలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయంలోకి అనుమతించలేదు



ఆలయంతో పాటు భూమిని ఆక్రమించుకున్న టీడీపీ నేత కృష్ణమూర్తి నాయుడు అన్యాయంగా అర్ధరాత్రి యంత్రాల సాయంతో ధ్వంసం చేశాడు. తరతరాలుగా ఇక్కడ ఉన్న మాకు లేని పట్టాలు ఎక్కడి నుంచో వచ్చిన కృష్ణమూర్తి నాయుడుకు ఎలా వస్తుంది. గతంలో ఇదే నేత కారణంగా ఓ వ్యక్తి గుండెపోటుతో మరణించాడు. ఇంతటి దారుణానికి ఒడిగట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి. – పి. కుమారి, దామినేడు స్థానికురాలు

ఎమ్మెల్యే మౌనంగా ఎందుకున్నారు?



గత ప్రభుత్వంలో విగ్రహాలకు ఏదో జరిగిందంటూ రోడ్డెక్కిన టీడీపీ నేతలు ఇప్పుడేమయ్యారు. ఇది ముమ్మాటికి హిందువులపైన దాడే. చంద్రగిరి నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నా, స్థానిక టీడీపీ ఎమ్మెల్యే నాని ఎందుకు పట్టించుకోవడం లేదు. ఆలయాలను కూల్చిస్తే భగవంతుడు చూస్తూ ఊరుకోరు. వారాహి ఆలయ వివాదం విషయంలోనూ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. – చీనేపల్లి కిరణ్, హిందూ సంఘం ప్రతినిధి

తరతరాలుగా పూజిస్తున్నాం



నా వయస్సు 80 ఏళ్లు. నాకు తెలిసినప్పటి నుంచి ఇక్కడ చెట్టు కింద నాగాలమ్మకు పూజలు చేస్తూనే ఉన్నాం. మా పూర్వీకుల నుంచి ఇలవేల్పుగా కొలుస్తున్నాం.ఆలయాన్ని ధ్వంసం చేయడం దారుణం. – మీనాక్షమ్మ, స్థానికురాలు

ఏ శుభకార్యమైనా ఇక్కడ నుంచే ప్రారంభిస్తాం



మా గ్రామంలోని ఏ ఇంట్లో అయినా శుభకార్యానికి ముందు నాగాలమ్మకు పూజలు చేసే ప్రారంభిస్తాం. అలాంటి మా కులదైవాన్ని మాకు కాకుండా టీడీపీ నేత కృష్ణమూర్తి నాయుడు అడ్డుకున్నాడు. దొంగ పత్రాలను సృష్టించి భూములను కాజేయడంతో పాటు మాపైనే దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఇప్పుడు ఏకంగా మా ఆలయాన్ని ధ్వంసం చేసి, ఆనవాళ్లు లేకుండా చేసేందుకు యత్నిస్తున్నాడు. – ఐ. కుమారి, స్థానికురాలు

భూములను కాజేసేందుకే..



జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఇనాం భూములు విలువ కోట్ల రూపాయలు పలుకుతోంది. ఈ భూమిని కాజేసేందుకు టీడీపీ నాయకుడు కృష్ణమూర్తి నాయుడు ఇంతటి దురాగతానికి పాల్పడుతున్నాడు. తాత ముత్తాల కాలం నుంచి మేము ఇక్కడే జీవిస్తున్నాం. ఇక్కడ భూమిని విక్రయించేందుకు నాగాలమ్మ ఆలయం అడ్డుగా ఉందనే, ఆలయాన్ని నేలమట్టం చేశాడు. – నాగలక్ష్మి, స్థానికురాలు

మా ఇంటి ఇలవేల్పును కూల్చేశారు



గ్రామంలోని ఎంతో మంది నాగాలమ్మ దేవత ఇలవేల్పుగా పూజలందుకుంటోంది. ఇప్పటికే మా భూములను అక్రమంగా లాక్కోవడంతో పాటు సగం గ్రామాన్ని అధికారులు అతనిపై రికార్డులు సృష్టించి ఇచ్చారు. ఇప్పుడు మా ఇలవేల్పును ధ్వంసం చేసేశాడు. ఈ కూటమి అండతో మమల్ని కూడా చంపేస్తాడేమోనని భయం వేస్తోంది. స్థానిక ఎమ్మెల్యే నాని గానీ, టీడీపీ నాయకులు గాని ఇటువైపు తిరిగి చూడలేదు. – మల్లీశ్వరి, స్థానికురాలు

డాక్టర్ మాధవికి కౌన్సిల్‌లో చోటు



డాక్టర్ మాధవి

తిరుపతి తుడా : ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ కౌన్సిల్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 8 మంది వైద్యులతో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ను నియమించారు. ఇందులో ఎస్వీ మెడికల్ కళాశాల పరిధిలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి చెందిన ప్రొఫెసర్ కె.మాధవికి కౌన్సిల్‌లో చోటు కల్పించారు.

రేపటి నుంచి డిగ్రీ, పీజీ తరగతులు ప్రారంభం

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలోని అన్ని డిగ్రీ, పీజీ కళాశాలల్లో సోమవారం నుంచి తరగతులు పునఃప్రారంభం కానున్నాయి. నెలరోజుల పాటు వేసవి సెలవుల అనంతరం తరగతులు ప్రారంభం కానునుండటంతో ఆయా కళాశాలల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. కళాశాలలతో పాటు అదే రోజు వసతి గృహాలు సైతం తెరుచుకోనున్నట్లు అధికారులు తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీలో సైతం తరగతులు ప్రారంభం కానున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీడబ్ల్యూ, ఎస్‌జీఎస్, ఎస్వీ ఆర్ట్స్, ఎస్వీ ఓరియంటల్ కళాశాలలు సోమవారం నుంచి తరగతులు పునఃప్రారంభం కానున్నాయి.

తిరుమలలో మందుల దుకాణాలు సీజ్

తిరుమల : తిరుమలలో నిబంధనలను ఉల్లంఘించి విక్రయాలు జరుపుతున్న మందుల(మెడికల్) దుకాణాలపై టీటీడీ రెవెన్యూ విభాగం అధికారులు కొరడా ఝుళిపించారు. ఈ మేరకు శనివారం తిరుమలలోని దుకాణాలపై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో టీటీడీ నుంచి సరైన అనుమతులు లేకుండా, అర్హులైన ఫార్మసిస్టు లేకుండా మందులను విక్రయిస్తున్న ఆరు దుకాణాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన దుకాణాలు ప్రభుత్వ డ్రగ్ లైసెన్సు, అర్హులైన ఫార్మసిస్టుల ద్వారానే మందులను విక్రయించాలని లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

మామిడి రైతులను ఆదుకుంటాం


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

పాకాల:మామిడి రైతులు నష్టపోకుండా ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. శనివారం దామలచెరువులో జరిగిన మామిడి రైతులతో ముఖాముఖి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ.. మామిడి రైతులకు గిట్టుబాటు ధర అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 3 ఫ్యాక్టరీలతో మామిడి రైతులు నష్టపోతున్నారని, రైతులకు నష్టం కలిగించే ఫ్యాక్టరీలపై మంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు.

అధిక దిగుబడులతోనే ధరలు పతనం

జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా తోతాపురిని అత్యధికంగా 4 నుంచి 5 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి జరిగిందని, పంట దిగుబడి అధికం కావడంతో రేటు తగ్గిందని తెలిపారు. వ్యాపారులు, ఫ్యాక్టరీ యజమానులు, సప్‌లైయర్స్ రైతుల నుంచి తోతాపురి మామిడిని రూ.8కు కొనుగోలు చెయ్యాలని, ప్రభుత్వం నుంచి సంబంధిత రైతుకు రూ.4 చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేసీ శుభంబన్సల్, హార్టికల్చర్ స్టేట్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీవో రామ్మోహన్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 75,096 మంది స్వామివారిని దర్శించుకోగా 36,262 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.93 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యార్థులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూసిన నీట్ (యూజీ) ఫలితాలు విడుదల అయ్యాయి. దేశ వ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ ఫలితాలను శనివారం అధికారులు విడుదల చేశారు. మే నెల 4న జరిగిన నీట్ పరీక్ష ప్రాథమిక కీని ఇటీవల విడుదల చేశారు. తాజాగా విడుదల చేసిన ఫలితాల్లో తిరుపతి జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. అభిప్రాయాలు..వారి మాటల్లోనే..

నెఫ్రాలజిస్ట్ కావడమే లక్ష్యం



కిడ్నీ వ్యాధులకు సంబంధించిన నెఫ్రాలజిస్ట్ కోర్సును అభ్యసించి మెరుగైన వైద్య సేవలందించాలన్నదే నా లక్ష్యం. మాది తిరుపతి.. నాన్న సతీష్‌చంద్ర గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుడు , అమ్మ పావనీ నెఫ్రాలజిస్ట్ వైద్యురాలు. నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఓపెన్ విభాగంలో 934వ ర్యాంకు, కేటగిరి విభాగంలో 582వ ర్యాంకు సాధించా.

– జ్ఞానీషారెడ్డి, నీట్ ర్యాంకర్, తిరుపతి

కార్డియాలజిస్ట్‌గా రాణించాలని..



తిరుపతిలో నివాసం ఉంటూ చంద్రగిరిలో నాన్న హేమంత్‌కుమార్ పోస్టల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. జాతీయ స్థాయి ఓపెన్ విభాగంలో 2567వ ర్యాంకు, కేటగిరి విభాగంలో 587వ ర్యాంకు సాధించా. మా నాన్న గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నారు. అలాంటి వారికి చికిత్సలు అందించాలన్నదే నా లక్ష్యం. – మౌనిక, నీట్ ర్యాంకర్, తిరుపతి

ఎయిమ్స్‌లో చదవాలని



దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్ విద్యా సంస్థలో వైద్య విద్య అభ్యసించడమే నా లక్ష్యం. నాన్న డాక్టర్ కిరణ్, అమ్మ శైలజ ఇద్దరూ వైద్యులే.. నీట్‌లో ఓపెన్/కేటగిరి విభాగంలో 337వ ర్యాంకు సాధించా. ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసి మంచి వైద్యుడిగా సేవలందించడమే ధ్యేయం.

– ఓ.ఆరుష్ లక్ష్మణ్

పేదలకు నాణ్యమైన వైద్యం



మంచి వైద్యుడిగా పేదలకు సేవలందించడమే నా లక్ష్యం. మాది తిరుపతి పట్టణం. నాన్న మహేశ్ సివిల్ ఇంజినీర్. నీట్‌లో ఓపెన్ విభాగంలో జాతీయ స్థాయి 4,747వ ర్యాంకు కేటగిరి విభాగంలో 114వ ర్యాంకు సాధించా. సుదర్శన్ అగర్వాల్ స్ఫూర్తితో వైద్య సేవలదిస్తా.

–కుంచెపు విశ్వక్ అగర్వాల్, నీట్ ర్యాంకర్, తిరుపతి

మంచి వైద్యుడిగా సేవలందిస్తా



వైద విద్యనభ్యసించి మంచి వైద్యుడిగా సేవలందించడమే నా లక్ష్యం. అమ్మా నాన్న డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ శాంతకుమారి ఇద్దరూ డెంటల్ సర్జన్లు. నీట్‌లో ఓపెన్/కేటగిరి విభాగంలో 1042వ ర్యాంకు సాధించా. ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్‌లో వైద్య విద్య పూర్తి చేసి మంచి వైద్యుడిగా సేవలందిస్తా.

–వి.యశ్వంత్, నీట్ ర్యాంకర్, తిరుపతి

సమష్టిగా పోరాడుదాం


మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, నేతలు

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పెళ్లకూరు : కూటమి ప్రభుత్వంలో చోటు చేసుకుంటున్న కుట్ర రాజకీయాలకు దూరంగా ఉంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు ఐకమత్యంగా ఉండాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. శనివారం తిరుపతి నుంచి నెల్లూరు వెళుతున్న ఆయన మార్గ మధ్యలో చిల్లకూరు వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, సర్పంచ్ హరిబాబురెడ్డిని ఆయన సత్కరించారు. కక్ష పూరిత రాజకీయాలు రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయని వాటికి దూరంగా ఉంటూ పార్టీ కేడర్‌ను బలోపేతం చేసుకొనేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, మురళి, శ్రీనివాసులు, మోహన్‌రెడ్డి, మోహన్, వినోద్‌రెడ్డి, సుధాకర్, జనార్దన్‌రెడ్డి, జితేంద్ర, బాలు, గోపాల్ పాల్గొన్నారు.

భాషా పండితుల బదిలీల్లో చిత్ర విచిత్రాలు

- నేడు డీఈవో కార్యాలయం వద్ద ధర్నా

చిత్తూరు కలెక్టరేట్ : చాలా సంవత్సరాలుగా డీఈవో పూల్‌లో పెట్టి ఇబ్బందులు పెట్టారు. ఈ బదిలీల్లో అయినా దరఖాస్తు చేసుకుని అనుకూలమైన ప్రాంతాలకు వెల్దామని ఆశపడ్డారు. విద్యాశాఖ అధికారులు జారీ చేసిన సీనియారిటీ జాబితా ప్రకారం ఆన్‌లైన్‌లో బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న భాషా పండితుల బదిలీల ఉత్తర్వులను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు శనివారం విడుదల చేశారు. ఆ ఉత్తర్వులను చూసిన భాషాపండితులు నివ్వెరపోయారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీల ఉత్తర్వులు రావడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆన్‌లైన్ బదిలీలపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయని భాషా పండితులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నాకు సిద్ధమయ్యారు.

దారుణం

తుది సీనియారిటీ జాబితాలో 79వ నెంబర్‌లో ఉన్నటువంటి భాషాపండితునికి తన ప్రాధాన్యత క్రమం ప్రకారం కాకుండా ఇంటికి దగ్గరలో ఉన్న తిరుపతిలో పోస్టింగ్ ఇచ్చారు. ఇదేవిధంగా చాలా మందికి తుది సీనియారిటీ జాబితాల్లో కింద ఉన్న వారికి దగ్గరలో, మొదట్లో ఉన్న వారికి దూరంగా పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ సమస్యలపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నష్టపోయిన భాషాపండితులు కూటమి టీడీపీ నిలువునా ముంచేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దారుణం అంటూ సామాజిక మాధ్యమాల్లో తమ వ్యతిరేకతను వెల్లడిస్తున్నారు. సీనియారిటీ జాబితాల్లో 1, 2 స్థానాల్లో ఉన్న వారికి 30, 40వ ప్లేసుల్లో బదిలీ చేయడం వింతగా ఉందని మండిపడుతున్నారు. న్యాయం కోసం ఆదివారం డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు భాషా పండితులు సిద్ధపడ్డారు.

నిబంధనలకు వ్యతిరేకంగా బదిలీ ఉత్తర్వులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని డీఈవో పూల్‌లో ఉన్న తెలుగు 123, హిందీ 30 మంది భాషాపండితుల ఉత్తర్వులు నిబంధనలకు వ్యతిరేకంగా విడుదల చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఫైనల్ సీనియారిటీ జాబితాలో సీరియల్ నెంబర్ 15లో ఉన్న వ్యక్తి తన స్పౌజ్ తిరుపతిలో పనిచేస్తున్నారు. ఆన్‌లైన్ బదిలీల్లో ఆ టీచర్ తిరుపతిని ఆప్షన్‌గా పెట్టుకున్నారు. అయితే ఆ టీచర్ తన ప్రాధాన్యత క్రమంలో పెట్టిన 30వ ప్లేస్ పెనుమూరుకు పోస్టింగ్ ఇచ్చారు. అదేవిధంగా సీరియల్ నెంబర్ 17లో ఉన్న మరో భాషాపండితుని స్పౌజ్ తిరుపతిలో పనిచేస్తుండగా ప్రాధాన్యత క్రమంలో తిరుపతిని రెండవ ప్లేస్‌లో పెడితే చివరగా పెట్టిన వరదయ్యపాళ్యంకు బదిలీ చేశారు.

చివరి దశకు అయ్యోర్ల బదిలీలు

- బదిలీల్లో పలువురు టీచర్లకు అన్యాయం
- సమస్యల పరిష్కారానికి కుప్పలు తెప్పలుగా గ్రీవెన్స్‌లు
- నేటితో ప్రక్రియ ముగించేలా విద్యాశాఖ కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతుల కసరత్తు చివరి అంకానికి చేరింది. గత వారం రోజులుగా జరుగుతున్న ఈ ప్రక్రియ అయ్యోర్లకు చుక్కలు చూపించింది. కూటమి ప్రభుత్వం ఇష్టానుసారంగా నిబంధనలు పెట్టడంతో పలువురు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా పలు నిబంధనలను బదిలీల ప్రక్రియలో అమలు చేశారు. స్పౌజ్‌ల విషయంలో అనేక ఇబ్బందులు సృష్టించారు.

నేటితో ముగియనున్న ప్రక్రియ

జిల్లా కేంద్రంలోని షర్మన్ బాలికోన్నత పాఠశాలలో బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ ఆదివారంతో ముగియనుంది. ఈ నెల 14వ తేదీన సీరియల్ నం.2000 నుంచి 3000 వరకు కౌన్సెలింగ్ చేపట్టారు. అనంతరం మైనర్ మీడియా ఎస్జీటీల కౌన్సెలింగ్‌కు తక్కువ మంది ఉండడంతో ఆదివారంతో ప్రక్రియ ముగించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. సీనియారిటీ జాబితాల్లో తప్పిదాలు, వింత నిబంధనల వల్ల మెజారిటీ శాతం ఉపాధ్యాయులు బదిలీల్లో నష్టపోయారు. కూటమి సర్కారు పాలనలో నష్టపోయామంటూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్లు మండిపడుతున్నారు.

కుప్పలు తెప్పలుగా గ్రీవెన్స్

బదిలీల ప్రక్రియలో నష్టపోయిన టీచర్లకు న్యాయం చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు బాధిత టీచర్ల నుంచి గ్రీవెన్స్ తీసుకోవాలంటూ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లాలో దాదాపు 180 ఎస్జీటీ, 75 దాకా స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రీవెన్స్‌కొచ్చాయి. వీటిని ఎప్పుడు పరిష్కరిస్తారో తెలియని పరిస్థితి.

21నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

- తిరుపతి, గూడూరు, సత్యవేడులో హెల్ప్‌లైన్ సెంటర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ నెల 21నుంచి జూన్ 28వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన(కౌన్సెలింగ్) నిర్వహించనున్నట్లు తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌ను తిరుపతి, గూడూరు, సత్యవేడులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 20నుంచి జూన్ 27వ తేదీలోపు ''ఏపీపీఓఎల్‌వైసీఈటీ.ఎన్‌ఐసి.ఇన్'' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700/-, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250/- ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రసీదును ప్రింట్ అవుట్ తీసుకోవాలన్నారు. ఆయా తేదీల్లో ర్యాంకుల వారీగా ఏర్పాటుచేసిన కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని సూచించారు. ఈ నెల 25 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ర్యాంకుల వారీగా ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని, జూలై 1న ఆప్షన్స్‌లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చని, 3వ తేదీన అలాట్‌మెంట్ ప్రకటిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీట్లు పొందిన అభ్యర్థులు రూ.4,700/, ప్రైవేటు పాలిటెక్నిక్‌లో చేరే అభ్యర్థులు రూ.25వేలు ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు, సందేహాలకు సమీపంలోని హెల్ప్‌లైన్ సెంటర్లను, పాలిసెట్ కౌన్సెలింగ్ ఇన్‌చార్జ్ మహేంద్రను 94925 26080 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

పీడబ్ల్యూడీ, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, స్కౌట్స్ అండ్ గైడ్స్, వంటి స్పెషల్ కేటగిరి అభ్యర్థులు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ హాజరవ్వాలని పేర్కొన్నారు.

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ తేదీలు

తేదీ	ర్యాంకు నుంచి	ర్యాంకు వరకు
21-06-2025	1	15,000
22-06-2025	15,001	32,000
23-06-2025	32,001	50,000
24-06-2025	50,001	68,000
25-06-2025	68,001	86,000
26-06-2025	86,001	1,04,000
27-06-2025	1,04,001	1,20,000
28-06-2025	1,20,001	చివరి ర్యాంకు

తీసుకురావాల్సిన సర్టిఫికెట్లు ఇవే

కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ప్రింట్ అవుట్ తీసుకున్న ప్రాసెసింగ్ ఫీజు రసీదు, పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, పది, తత్సమాన విద్యార్హత మార్క్స్ మెమో, 4నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్, ఈడబ్ల్యూఎస్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రం, టీసీ ఒరిజినల్స్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలి.

నీట్‌లో శ్రీ చైతన్య ప్రభంజనం


ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీచైతన్య విద్యాసంస్థ ఏజీఎం, డీన్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : దేశంలోని వివిధ వైద్య కళాశాలల్లో ప్రవేశానికి ఏటా నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఓపెన్, వివిధ కేటగిరిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఈ ఫలితాల్లో ఓ.ఆరుష్ లక్ష్మణ్ 337వ ర్యాంకు, వి.యశ్వంత్ 1042, వి.దేవేందరన్ 1365, ఎన్.హరిత 2121, వీఎల్.హర్షిత 2277, కె.టీనారాణి 2368, జి.గునభూషన్ 2460, వై.దీక్షిత 2695, వై.మహతి 3723, వై.శివకృతిక్ 4126, కె.హర్షిత 4259, కె.కల్పన 4824వ ర్యాంకులతో పలువురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆ విద్యాసంస్థ ఏజీఎం బీవీ.ప్రసాద్ తెలిపారు. ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు 120 మంది వరకు ఎంబీబీఎస్ సీట్లు సాధించగలిగే ర్యాంకులు సాధించడం తమకు ఆనందంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులను ఆ విద్యాసంస్థ డీన్లు భాస్కర్, కేఎల్‌జీ.ప్రసాద్, రామ్మోహన్‌రావు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.

సమస్యలపై గళం విప్పుదాం

తిరుపతి అర్బన్ : గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సర్వేయర్లకు సంబంధించి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నిద్దామని సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుబాబు పేర్కొన్నారు. శనివారం తిరుపతిలోని సీపీఐ భవనంలో 3వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభ నిర్వహించారు. పలు జిల్లాల నుంచి హాజరైన సర్వేయర్లు 1000 మందికి పైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేయర్ల చేస్తున్న టెక్నికల్ విధులకు తగిన పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సర్వేయర్లకు సీనియార్టీ ప్రకారం ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. సచివాలయాల హేతుబద్ధీకరణలో భాగంగా మిగులు సిబ్బంది 4722 మందిని సర్వేకు సంబంధించిన శాఖల్లోనే శాశ్వత ప్రాతిపదికన తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సాయి కిరణ్, కార్యవర్గ సభ్యులు, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు మరియు రాష్ట్రంలోని అన్ని జిల్లాల గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.